# ఫార్మాను చెరబట్టి.. ఫ్యూచర్‌ను చూపెట్టి!

- అసెంబ్లీ ఎన్నికల ముందో మాట... అధికార పీఠం ఎక్కగానే ఇంకో బాట
- ఫార్మా సిటీ భూములను దానికే వినియోగిస్తామన్న రేవంత్ సర్కార్
- హైకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- తూచ్... అంటూ ఫార్మా భూముల్లోనే ఫ్యూచర్ సిటీకి క్యాబినెట్ ఆమోదం
- సాగర్-శ్రీశైలం హైవేల మధ్య భూముల్లో ఫోర్త్ సిటీకి మాస్టర్ ప్లాన్
- దీని పరిధిలోనే 19,333.20 ఎకరాల గ్రీన్ ఫార్మా సిటీ భూములు
- ఫ్యూచర్ సిటీలోనే కంపెనీలకు వరుసగా భూ కేటాయింపులు
- 17 నెలలుగా ఒక్క ఎకరాన్నీ సేకరించని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- మరి... కొత్త సిటీలకు, కంపెనీలకు భూమి ఎక్కడి నుంచి తెస్తారు?
- సాక్షాత్తూ హైకోర్టుకే రాష్ట్ర సర్కారు తప్పుడు సమాచారం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లోని పలు మండలాల పరిధిలో గ్రీన్ ఫార్మా సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణ చేపడుతుంది. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో ఫార్మా సిటీ ఏర్పాటు చేయనున్నారు. ఆ భూములను నిర్దేశించిన ఉద్దేశం (ఫార్మా సిటీ ఏర్పాటు) మేరకు మాత్రమే వినియోగిస్తారు గానీ, ఇతర అవసరాలకు వినియోగించరు. ఈ షరతు ఉల్లంఘన జరిగినట్లయితే ఈ భూములు తిరిగి రైతులకే చెందుతాయి.


– కేసీఆర్ ప్రభుత్వం ఫార్మా సిటీ కోసం స్పష్టమైన షరతుతో జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్ ఇది.

జనావాసాల మధ్య ఫార్మా సిటీ ఏర్పాటు చేయడం అన్యాయం. జనాలు లేని, ఇండ్లు లేని చోట ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయాలి. కేసీఆర్ ప్రభుత్వం ఫార్మా సిటీ కోసం రైతుల నుంచి తీసుకున్న భూములను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తిరిగి రైతులకే ఇస్తాం. 'ప్రజాభిప్రాయ సేకరణతో హైకోర్టు ఆదేశానుసారం ఫార్మా సిటీలను రద్దు చేస్తాం'.

**- కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల అభయహస్తం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ (8ఎ) ఇది.**

గుండాల కృష్ణ

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): 'చెరువుల్లో చేప పిల్లల్లా నా ఈ నగరం జనంతో నిండిపోవాలి...' హైదరాబాద్ నగరానికి పునాదిరాయి వేసినప్పుడు కులీ కుతుబ్‌షా ఆకాంక్ష ఇది. మంచి ఉద్దేశంతో కోరుకున్నందున ఇంతింతై.. వటుడింతై అన్నట్లు.. నగరం మహా సంద్రమైంది. కానీ, ఫార్మా సిటీ కోసం కేటాయించిన భూముల్లో ఫార్మా సిటీనే ఏర్పాటు చేస్తున్నామని సాక్షాత్తూ హైకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో స్పష్టం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం... అదే భూముల్లోని బేగరి కంచె వేదికగా ఫ్యూచర్ సిటీ అలియాస్ ఫోర్త్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించింది. మరి... కోర్టుకు చెప్పిందొకటి! పునాది రాయి వేసినప్పుడు ప్రకటించినది మరొకటి!! అబద్ధాల పునాదులపై ఫ్యూచర్ సిటీకి నాంది పలికారనేందుకు ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి? అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మా సిటీ భూముల్ని తిరిగి రైతులకు అప్పగిస్తామని ఏకంగా అభయహస్తం మ్యానిఫెస్టోలోనే పొందుపరిచిన ఆ పార్టీ కుర్చీ ఎక్కిన వెంటనే మాట మరిచింది... ఫార్మా రైతులకు మొండిచెయ్యి చూపుతున్నది. ముఖ్యమంత్రి, మంత్రులు రాష్ట్రంలోనే కాదు... విదేశీ పర్యటనల్లోనూ అనేక కంపెనీలకు ఈ ఫ్యూచర్ సిటీలో భూములు కేటాయిస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్న రేవంత్ సర్కారు అదనంగా ఒక్క ఎకరా సేకరించలేదు. మరి... ఫార్మా సిటీ భూముల్లోనే ఫార్మా కంపెనీలే ఏర్పాటు చేస్తే మరి ఫ్యూచర్ సిటీకి భూములెక్కడివి? ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేసినట్లు అనేక కంపెనీలకు భూములెక్కడి నుంచి తెస్తారు? ఎవరూ నోరు విప్పరు.. ఎందుకంటే హామీ ఇచ్చినట్లు ఫార్మా రైతులకు తిరిగి భూములను ఇచ్చేయాల్సి వస్తుందేమోనన్న జంకు! 'ప్రజలెన్నుకున్న ప్రభుత్వం... ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా... అసలు ప్రజలకే నిజాలు చెప్పకుండా... ఇలా దోబూచులాట ఆడటం...




### ఇంకెక్కడి ఫార్మా సిటీ?

**రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలం నుంచి ఫార్మా సిటీ ఎప్పుడో పారిపోయింది. అందులో ఎలాంటి అనుమానం లేదు. ఫార్మా సిటీ ఉందని కొంతమంది ఇంకా అనుకుంటున్నరు. ఇకపై ఫార్మా భూతమే ఉండదు. ఉంటే గింటే కాలుష్యం లేని ఇండస్ట్రీలు ఉంటయి. ఒక వేళ ఫార్మా ఉంటే ఈ మల్‌రెడ్డి రంగారెడ్డి గతంలో కంటే మీకు ఎక్కువగా అండగా ఉంటడు.**

**- భూభారతి అవగాహన సదస్సులో కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

ప్రజలే చేజేతులా చేసుకున్న ఖర్మ' అని ఫార్మా రైతులు ఆవేదన చెందుతున్నారు.

#### అభయహస్తం మ్యానిఫెస్టోలో భూములు తిరిగిస్తామని హామీ

రంగారెడ్డి జిల్లాలో దేశంలోనే అతి పెద్ద గ్రీన్ ఫార్మా సిటీ ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టు చేపట్టింది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలో 19,333.20 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఇందులో 9,806.05 ఎకరాలు రైతుల వద్ద ఉన్న ప్రైవేటు భూమి కాగా, గతంలో టీఎస్ఐఐసీ రైతుల నుంచి సేకరించిన 400.75 ఎకరాలు, 2,704.90 ఎకరాల ప్రభుత్వ భూమి, టీఎస్ఐఐసీ ఆధీనంలోని మరో 6,209.50 ఎకరాలు, వంద ఎకరాల ట్రాన్స్‌కో భూములతో పాటు 110 ఎకరాల విస్తీర్ణంలో నీటి వనరులు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఇందులో దాదాపు 14 వేల ఎకరాల పైచిలుకు భూసేకరణ పూర్తి చేసింది. ఇందులో రైతుల నుంచి సేకరించిన పట్టా భూములు సుమారు 3-4 వేల ఎకరాల వరకు ఉండగా... మిగిలినది సేకరించాల్సి ఉంది. ఫార్మా సిటీ ఏర్పాటుకుగాను మొదటి దశ అనుమతులు కూడా వచ్చాయి. తుది అనుమతులు రావాల్సి ఉంది. ఫార్మా సిటీలో కంపెనీల ఏర్పాటు కోసం 300-350 కంపెనీలు దరఖాస్తు కూడా చేసుకున్నాయి. అయితే రైతుల నుంచి సేకరించిన పట్టా భూమికి ఎకరాకు రూ.16.50 లక్షల వరకు, అసైన్డ్ భూమికి ఎకరాకు రూ.8.50 లక్షల వరకు పరిహారాన్ని సర్కారు ఇచ్చింది. దీంతోపాటు భూమిని కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చేందుకుగాను కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో 1,400 ఎకరాలను సేకరించి.. లేఅవుట్‌ను అభివృద్ధి చేసి ఎకరాకు 121 చదరపు గజాల చొప్పున అభివృద్ధి చేసిన ప్లాటును కూడా పంపిణీ చేసింది. భూములు కోల్పోయిన రైతు కుటుంబాల్లో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకుగాను కందుకూరు మండల పరిధిలో 1,400 మంది, యాచారం మండల పరిధిలో 3,600 మందిని గుర్తించారు. వీరిలో సాంకేతిక అర్హతలు లేని వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు డ్రైవ్‌ను కూడా చేపట్టారు. తుది అనుమతులు రాగానే దరఖాస్తు చేసుకున్న కంపెనీల్లో ప్రాధాన్యత, ఇతర అర్హతల మేరకు భూ కేటాయింపులు జరిగేవి. అదే సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ భూముల్లో ఫార్మా సిటీ ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఆందోళనలు చేసింది. అధికారంలోకి వస్తే రైతుల భూములు తిరిగి ఇస్తామని ప్రకటించింది. అభయహస్తం మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన పాదయాత్రలో రైతులకు హామీ ఇచ్చారు.

#### రద్దుపై లీకులు...

అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలు నిర్వహించి ఎయిర్‌పోర్టు మెట్రోతో పాటు ఫార్మా సిటీ రద్దుపై కూడా నిర్ణయం తీసుకున్నారు. మీడియా చిట్‌చాట్‌లోనూ ఇదే నిర్ణయాన్ని ప్రకటించారు. కానీ, ఫార్మా సిటీ భూసేకరణ నోటిఫికేషన్‌లోని షరతుల్ని అధికారులు గుర్తుచేయడంతో దానిని అధికారికంగా ప్రకటించకుండా దోబూచులాట మొదలుపెట్టారు. 'ఫార్మా సిటీని ఏర్పాటు చేసేందుకు సేకరిస్తున్న భూముల్లో గ్రీన్ ఫార్మా కంపెనీలను మాత్రమే ఏర్పాటు చేస్తాం. నిర్దేశిత అవసరాలకు వినియోగించనట్లయితే తిరిగి భూములు రైతులకు చెందుతాయి' అనే షరతును నోటిఫికేషన్‌లోనే కేసీఆర్ ప్రభుత్వం చేర్చింది. అధికారులు ఈ విషయాన్ని సీఎం రేవంత్ చెవిన వేయటంతో అప్పటి నుంచి సర్కారు హైడ్రామా మొదలైంది. దీనికి బదులుగా ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు ప్రకటనలు చేస్తారు గానీ, అధికారికంగా ఫార్మా సిటీ రద్దును మాత్రం ప్రకటించరు. క్షేత్రస్థాయిలోనూ అందుకు భిన్నంగా ఫార్మా భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, ఫ్యూచర్ సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఇలా అనేక ప్రాజెక్టులు తీసుకువచ్చారు. దీనికి తోడు అనేక కంపెనీలకు కూడా ఇందులో భూములు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు అధికారికంగానే ప్రకటిస్తున్నారు. అయితే ఫార్మా సిటీ భూములు అనకుండా దానికి ఫ్యూచర్ సిటీ ట్యాగ్ తగిలించారు. ప్రభుత్వ చర్యలు, లీకులు, పత్రికా కథనాలను చూసిన రైతులు రాష్ట్ర ప్రభుత్వమే షరతు ఉల్లంఘించినందున తమ భూములు తమకు ఇవ్వాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కానీ, అక్కడ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో హైడ్రామాకు తెరలేపింది. హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో అసలు తాము ఫార్మా సిటీ రద్దు నిర్ణయమే తీసుకోలేదని, ఇదంతా పత్రికల్లో వచ్చిన వదంతులు మాత్రమేనని కొట్టిపారేసింది.

### అదనంగా కంపెనీలకు భూములు...

- ఫ్యూచర్‌సిటీలో మారుబేని కంపెనీ రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు ప్రకటించారు.
- సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్‌లో పర్యటించినప్పుడు కూడా ఫ్యూచర్ సిటీలో రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 'ఎస్టీ టెలి మీడియా గ్లోబల్ డాటా సెంటర్స్ ఇండియా' సంస్థ ముందుకొచ్చిందని ప్రకటించారు.
- తైవాన్‌కు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల సమూహం (ఎలీజియన్స్ గ్రూప్) ఫ్యూచర్ సిటీలో రూ.2 వేల కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిందని ప్రభుత్వం గత నెలలో ప్రకటించింది.
- తైవాన్ రాజధాని తైపీలో జరిగిన తైవాన్-భారత్ ఆర్థిక సదస్సులో భాగంగా ప్రపంచస్థాయి సాంకేతిక, పారిశ్రామిక పార్క్ (ఐటీఐపీ) ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తంచేసినట్టు తెలిపింది.
- ఫోర్త్‌సిటీలోని ఏఐ సిటీకి సుమారు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం చెప్తున్నది.

## ఎకరా సేకరించకుండా వీటికి భూములెక్కడివి?

*నాగార్జునసాగర్-శ్రీశైలం రాష్ట్ర రహదారుల సరిహద్దుగా ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. ఇందులోనే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రీన్ ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదనంగా ఒక్క ఎకరా కూడా సేకరించలేదు. కానీ, గత 17 నెలలుగా ఫ్యూచర్ సిటీలో అనేక ప్రాజెక్టులు, కంపెనీలకు భూ కేటాయింపులు చేస్తున్నట్లు ప్రకటించింది. మరి... వీటికి భూములు ఎక్కడివి? అనే ప్రశ్నకు మాత్రం ఏ ఒక్కరూ సమాధానం చెప్పడం లేదు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ... హైకోర్టుకు అఫిడవిట్‌లో లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీ... రెండింటినీ తూచ్ అంటూ క్షేత్రస్థాయిలో ఫార్మా భూములను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నది.*

- *ఫోర్త్ సిటీలో స్పోర్ట్స్ యూనివర్సిటీని 200 ఎకరాల్లో ఏర్పాటు చేస్తామని రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది.*
- *స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు కాకుండా పలు ఇతర యూనివర్సిటీల ఏర్పాటు కోసం యూనివర్సిటీ జోన్‌ను 600 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.*
- *ఫ్యూచర్ సిటీలోనే ఐఐహెచ్‌టీని నెలకొల్పుతున్నట్లు చెప్పారు.*
- *శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్నందున ఫోర్త్ సిటీలో 250 ఎకరాల విస్తీర్ణంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.*
- *ఫోర్త్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో గుజరాత్‌లోని జామ్‌నగర్ వన్‌తారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం తరహాలో సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. 2 వేల ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ ఉండగా... జూపార్కు, నైట్ సఫారీ, ఏకో టూరిజం కేంద్రానికి కేటాయించనున్నారు.*
- *ఫ్యూచర్ సిటీలోనే 160 ఎకరాలను హైదరాబాద్ రేస్ కోర్సుకు కేటాయించారు.*
- *ఫోర్త్ సిటీలో 250 ఎకరాల విస్తీర్ణంలో వరల్డ్ క్లాస్ గోల్ఫ్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.*
- *ఫ్యూచర్ సిటీలో 70 ఎకరాల విస్తీర్ణంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ తరహాలో బిజినెస్ హబ్ ఏర్పాటు.*
- *ఫోర్త్ సిటీలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని పలు సమీక్షల్లో సీఎం రేవంత్ ప్రకటించగా... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా సీఐఐ సదస్సుల్లో తెలిపారు. ఈ మేరకు రెసిడెన్షియల్, స్కూల్స్, ఇన్‌ఫ్రా కోసం 4 వేల ఎకరాలు కేటాయింపు.*
- *ఫ్యూచర్ సిటీలో ఎలక్ట్రానిక్స్, ఇతరత్రా పరిశ్రమల ఏర్పాటు కోసం 6 వేల ఎకరాలు.*
- *ఫోర్త్ సిటీలో రిక్రియేషనల్ జోన్‌కు 550 ఎకరాలు.*
- *ఫోర్త్ సిటీలో ఫర్నీచర్ పార్క్ ఏర్పాటు కోసం 450 ఎకరాలు.*
- *ఫ్యూచర్ సిటీలో హెల్త్ సిటీకి 500 ఎకరాల కేటాయింపు.*
- *ఫ్యూచర్ సిటీలో లైఫ్ సైన్స్ హబ్ ఏర్పాటు కోసం 3 వేల ఎకరాల వరకు కేటాయింపు.*
- *సౌత్ కొరియా యంగ్ వన్ కార్ప్ ఆధ్వర్యంలో ఫ్యాషన్ టెక్నాలజీ వర్సిటీకి 20 ఎకరాలు.*
- *జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలోనే ఇండ్ల స్థలాల కేటాయిస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.*
- *ఇవన్నీ కాకుండా ఫోర్త్ సిటీలో 300 ఫీట్ల వెడల్పుతో 41 కిలోమీటర్ల పొడవైన గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం.*
- *శంషాబాద్ విమానాశ్రయం, రీజనల్ రింగ్ రోడ్డును అనుసంధానించేందుకు రహదారుల నిర్మాణం, మెట్రో రైలు నిర్మాణాలు.*



*లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డివిజన్-6 సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేశ్*

## సిక్‌లీవ్‌ల ధ్రువీకరణకు రూ.20 వేలు డిమాండ్

- సహోద్యోగికి వేధింపులు
- లంచం తీసుకుంటుండగా ఇద్దరిని పట్టుకున్న ఏసీబీ

సుల్తానాబాద్, ఏప్రిల్ 23: సిక్ లీవ్‌లు ధ్రువీకరించేందుకు సహోద్యోగి నుంచే రూ.20 వేల లంచం తీసుకుంటుండగా బుధవారం ఇద్దరు ఉన్నతోద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఎస్సారెస్పీ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఇజాజ్ గతేడాది సిక్ లీవ్ తీసుకున్నారు. సిక్ లీవ్స్‌ను ధ్రువీకరించేందుకు ఎస్సారెస్పీ డివిజన్-6 సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేశ్ రూ.20 వేల లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం వారిని ఏసీబీ కోర్టుకు తరలించారు.

## ఫ్యూచర్‌సిటీ పేరుతో కాంగ్రెస్ మోసం

- ఫార్మా భూముల వాడకం చట్టవిరుద్ధం
- భూముల్ని గుంజుకొని రియల్ దందా చేయడమే అభివృద్ధా?
- రేవంత్‌రెడ్డి సర్కారుపై జాతీయ సంఘాల ప్రతినిధులు, నిజనిర్ధారణ కమిటీ సభ్యుల ఫైర్
- ఫార్మా రైతులతో మాట్లాడిన పర్యావరణవేత్తలు
- ఫెన్సింగ్ వేసిన భూముల పరిశీలన



*ఫార్మా బాధిత రైతులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు*

యాచారం, ఏప్రిల్ 23: 'ఫ్యూచర్ సిటీ పేరుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నది.. అసలు ఫార్మా భూములను ఫోర్త్‌సిటీకి వాడటం చట్ట వ్యతిరేకం.. ఆ భూములతో రేవంత్‌రెడ్డి సర్కార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నది..' అని జాతీయ సంఘాల ప్రతినిధులు, నిజనిర్ధారణ కమిటీ బృందం సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని యాచారం మండలంతోపాటు ఇతర ప్రాంతాల్లోని ఫార్మా భూముల్లో రైతుల పరిస్థితులపై బుధవారం ఈ బృందం అధ్యయనం చేసింది. ఈ బృందంలో పీపుల్స్ జేఏసీ తెలంగాణ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, జాయింట్ కన్వీనర్ రవి కన్నెగంటి, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వనమాల, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక ప్రతినిధి మీరా సంఘమిత్ర, హైకోర్టు ప్రధాన న్యాయవాది సాజీద్, తెలంగాణ పీపుల్స్ జేఏసీ ప్రతినిధి ఉస్మాన్, మానవహక్కుల వేదిక ప్రతినిధి నరసింహ, చైతన్య మహిళా సంఘం ప్రతినిధులు జ్యోతి, శ్రీదేవి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్, న్యాయవాదులు అశోక్, కొండల్‌రెడ్డి, రవీంద్ర తదితరులు ఫార్మా వ్యతిరేక పోరాట కమితి సమన్వయకర్త కవుల సరస్వతి ఆధ్వర్యంలో పర్యటించారు. అనంతరం పలువురు బృంద సభ్యులు మాట్లాడారు. పచ్చని పొలాల్లో ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అంటూ ఏవేవో పేర్లు పెట్టి, మరేవో కంపెనీలు ఏర్పాటుచేసి రైతులను రోడ్డున పడేయాలని చూడటం అన్యాయమని ధ్వజమెత్తారు. రైతుల నుంచి బలవంతంగా భూములను గుంజుకొని పరిశ్రమలు పెడితే అది అభివృద్ధి ఎట్లా అవుతుందని ప్రశ్నించారు. ఫార్మాసిటీ రద్దు విషయంలో అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయగా, స్థానిక కాంగ్రెస్ నేతలు మాత్రం ఫార్మాసిటీ రద్దయిందని రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

### భూరక్షణ కోసం సంఘటిత ఉద్యమం

రైతులందరూ సంఘటితంగా ఉండి తెలంగాణలో వ్యవసాయ భూములను కాపాడుకునేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతుల పక్షాన పాదయాత్రలు, ధర్నాలు, ఆందోళనలు చేసిన కాంగ్రెస్ నాయకులు నేడు ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. ఫ్యూచర్ సిటీ ప్రతిపాదనను విరమించుకొని భూసేకరణను ఆపాలని, వెంటనే రైతుల భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని డిమాండ్ చేశారు. ఫార్మా రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పర్యావరణవేత్తలు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకులు కానమోని గణేశ్, సందీప్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

#### గద్దెనెక్కగానే మాటమార్చిన కాంగ్రెస్

'కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలేమిటి? ప్రస్తుతం చేస్తున్నదేమిటి?' అని పర్యావరణవేత్తలు సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే 2013 చట్టం అమలు చేస్తామని, ఫార్మాసిటీని రద్దు చేస్తామని, రైతుల భూముల్ని వారికే తిరిగిస్తామన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు గద్దెనెక్కి పదవులు రాగానే మాటమార్చడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకపక్క రాజ్యాంగాన్ని రక్షిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అంటుంటే.. మరోపక్క తెలంగాణ ముఖ్యమంత్రి మాత్రం రాజ్యాంగ విరుద్ధంగా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ పోలీస్ బలగాలతో భూములకు ఫెన్సింగ్ వేయించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రైతులను బెదిరించి భూములను లాక్కునే హక్కు ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. పోలీస్ బలగాలతో బలవంతంగా సర్వే చేయడం, ఫెన్సింగ్ వేయడం ఏమిటని ప్రశ్నించారు. పరిశ్రమల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. పచ్చని పంటపొలాల్లో విషపూరిత పరిశ్రమలను పెట్టొద్దని డిమాండ్ చేశారు.



*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండలో ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న రైతులను నెట్టేస్తున్న పోలీసులు, కాంగ్రెస్ నాయకులు*

## ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకున్న రైతులు

- నకిలీ విత్తన కంపెనీపై చర్యలేవని ఆందోళన
- పక్కకు నెట్టేసిన పోలీసులు, కాంగ్రెస్ నాయకులు
- వాహనం దిగకుండానే వెళ్లిపోయిన ఆదినారాయణ
- ఎమ్మెల్యే తీరుపై చండ్రుగొండ రైతులు మండిపాటు

చండ్రుగొండ, ఏప్రిల్ 23: నకిలీ మక్కజొన్న విత్తన కంపెనీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నెలలు గడిచినా చర్యలు తీసుకోకపోవడంతో విసుగు చెందిన రైతులు (కాంగ్రెస్ పార్టీకి చెందినవారే) ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకొని రోడ్డుపై బైఠాయించారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్నది. చండ్రుగొండ మండలం పోకలగూడెం పంచాయతీకి చెందిన 12 మంది గిరిజన రైతులు ఓ కంపెనీకి చెందిన మక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి యాసంగి పంట సాగు చేశారు. దిగుబడి సరిగా రాకపోవడంతో సదరు కంపెనీపై ఫిబ్రవరిలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ కంపెనీపై చర్యలు తీసుకోకపోగా.. తమను పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించుకోవడంతో విసుగు చెందిన రైతులు బుధవారం మండల పర్యటనకు వచ్చిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కాన్వాయ్‌ను అడ్డగించి జాతీయ రహదారిపై బైఠాయించారు. అప్రమత్తమైన పోలీసులు, కాంగ్రెస్ నాయకులు రైతులను పక్కకు నెట్టే ప్రయత్నం చేయగా వాగ్వాదం చోటుచేసుకున్నది. ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకోవడం సరికాదని కాంగ్రెస్ నాయకుడు కిరణ్‌రెడ్డి వారించడంతో అతడిపై రైతులు తిరగబడ్డారు. దీంతో ఆయన అక్కడి నుంచి జారుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు రైతులను బలవంతంగా పక్కకు నెట్టేశారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే కారు దిగకపోవడంపై రైతులు మండిపడ్డారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులకు కాంగ్రెస్ నాయకులు, పోలీసులు వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆరోపించారు. సొంత పార్టీకి చెందిన రైతులే ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకోవడం గమనార్హం.

## విద్యుత్తు కనెక్షన్‌కు రూ.50 వేలు లంచం

### రూ.10 వేలు తీసుకుంటుండగా పట్టుబడిన ఏఈ

వనపర్తి టౌన్, ఏప్రిల్ 23 : రైస్‌మిల్లుకు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చేందుకుగానూ లంచం డిమాండ్ చేసిన ఏఈని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఈ బాలకృష్ణ కథనం మేరకు.. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మల్కాపూర్ శివారులోని తిరుమల ఆగ్రో ఇండస్ట్రీస్ (రైస్ మిల్లు)కు 55 కేవీ విద్యుత్తు కనెక్షన్ ఇచ్చేందుకుగానూ సలీం అనే వ్యక్తి కాంట్రాక్టును దక్కించుకున్నాడు. పనులు పూర్తిచేశాక కనెక్షన్ ఇవ్వాలని ఖిల్లాఘణపురం విద్యుత్ శాఖ ఏఈ కొండయ్యను కోరగా ఆయన రూ.50 వేల లంచం డిమాండ్ చేశారు. దీంతో మొదటి విడతగా సలీం రూ.30 వేలు చెల్లించాడు. మిగితా రూ.20 వేలు ఇస్తేనే కనెక్షన్ ఇస్తానని ఏఈ చెప్పడంతో చేసేదేమీ లేక సలీం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల పథకం ప్రకారం బుధవారం వనపర్తిలో ఏఈ కొండయ్యకు రూ.10 వేలు అందజేస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని ఏసీబీ డీఈ సూచించారు.



ఏసీబీకి పట్టుబడిన విద్యుత్తు ఏఈ కొండయ్య

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆగ్రహం

### మంచిర్యాల జిల్లా వెల్గనూర్‌లో ఐకేపీ సీసీపై మండిపాటు

దండేపల్లి, ఏప్రిల్ 23: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు మండిపడుతున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేయకపోవడంపై బుధవారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐకేపీ సీసీ కొమురవెల్లిని రైతులు నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యం తూకం విషయంలో నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ముందుగా తెచ్చిన వారి ధాన్యాన్ని తూకం వేయకుండా తర్వాత వచ్చినవారి ధాన్యాన్ని తూకం వేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తూకం యంత్రాలు తక్కువగా ఉండటంతోనే కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని, గురువారం మరో నాలుగు తూకం యంత్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్‌లో ఐకేపీ సీసీని నిలదీస్తున్న రైతులు